క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



నూతనంగా ప్రతిష్టించిన అభయాంజనేయస్వామి మూలవిరాట్

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులో శ్రీఅభయాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం పురోహితులు వారణాసి వెంకటరమణవరప్రసాద్ బ్రహ్మత్వమున అన్నదానం శివబాలకు మార్‌శర్మ ఆచారత్వమున అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. శిఖర కలశ ప్రతిష్ట, ధ్వజప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, జ్వాలాదర్శనం, గోదర్శనం, శిఖర కలశ కుంభాషేకం, శ్రీసీతారాముల శాంతి కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి కాయకర్పూరం సమర్పించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందజేశారు.

నేడు తిరంగ ర్యాలీ

దువ్వూరు : ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా దువ్వూరులో గురువారం తిరంగ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆరవేటి హరికృష్ణ, మండల అధ్యక్షుడు అమ్మిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దువ్వూరు బైపాస్ రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి బైక్ ర్యాలీని దువ్వూరు సెంటర్ వరకు నిర్వహించి భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తామని వారు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు అభిప్రాయ సేకరణ

ప్రొద్దుటూరు : స్థానిక శివాలయం ఎదురుగా కూరగాయల మార్కెట్, కమర్షియల్ కాంప్లెక్స్ రూముల గుడ్‌విల్ పద్ధతిపై బాడుగకు ఇచ్చే విషయంపై అభిప్రాయ సేకరణ కోసం ఈనెల 23న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశ భవనంలో సమావేశం నిర్వహించనున్నట్లు మేనేజర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పట్టణంలోని కూరగాయల మార్కెట్ అసోసియేషన్, కిరాణా దుకాణాల అసోసియేషన్, బంగారు షాపుల అసోసియేషన్, క్లాత్ మార్కెట్స్ అసోసియేషన్ వారు, ఆర్యవైశ్య అసోసియేషన్ వారు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

28న మోడల్ డీఎస్సీ పరీక్ష

ప్రొద్దుటూరు : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లా వ్యాప్తంగా జరిగే మోడల్ డీఎస్సీ పరీక్షను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ తెలిపారు. బుధవారం వారు తమ కార్యాలయంలో మాట్లాడుతూ మోడల్ డీఎస్సీ పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందిస్తారన్నారు. ఎస్జీటీ అభ్యర్థులకు మాత్రమే మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక సృజన కోచింగ్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8008087023, 6302257340 సంప్రదించాలని కోరారు.

అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న రాజారమేష్

కాశినాయన : మండలంలోని అమగంపల్లె బాలమ్మసత్రంలోని వృద్ధులకు బుధవారం బెంగళూరుకు చెందిన కొండవీటి రాజారమేష్ కుమార్తె శరణ్య పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమార్తె పుట్టినరోజును వృద్ధులతో జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అనాథలకు ఆశ్రయం కల్పించిన ఆశ్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రగతి శ్రీనివాసులు, పి.గురివిరెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఓబయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : బాలమ్మసత్రం వృద్ధాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు బుధవారం బెంగళూరుకు చెందిన రాజారమేష్, అంబిక దంపతులు అన్నదానం చేశారు. వారి కూతురు చరణ్య పుట్టిన రోజును పురస్కరించుకొని అభాగ్యులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చాపాటి నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఓబయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి బాలల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

కడప కల్చరల్ : సీనియర్ రాజయోగిని గీత దీదీ ఆధ్వర్యంలో గురువారం నుంచి కడప నగరంలో ప్రత్యేక బాలల శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. నగరంలోని ఓం శాంతి నగర్ సేవా కేంద్రం ఓం నివాస్ భవనంలో బ్రహ్మకుమారీలు చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమం ఈ నెల 24 వరకు నిర్వహించనున్నారు.

సర్వర్ డౌన్‌తో తప్పని తిప్పలు

- రేషన్ కార్డు దరఖాస్తుల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- వేధిస్తున్న సర్వర్ సమస్య
- కొన్నింటికి ఆప్షన్లు లేకపోవడంతో అవస్థలు



రేషన్‌కార్డు దరఖాస్తు కోసం సచివాలయంలో వేచి ఉన్న లబ్ధిదారులు

కాశినాయన : కూటమి ప్రభుత్వం సచివాలయాల నిర్వహణను గాలికొదిలేసింది. కార్యాలయాల నిర్వహణ, కంప్యూటర్ల సర్వీసింగ్, అవసరమైన మరమ్మతు నిధులు మంజూరు చేయడం లేదు. ఈ కారణంగా పలు సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు మూలకుచేరాయి. ప్రస్తుతం రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దీనికి తోడు సర్వర్ డౌన్ కావడంతో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది.

అర్హత ఉన్న వారు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సర్వర్ సమస్యతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

గ్రామ సచివాలయాల వద్ద పడిగాపులు

కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి జిల్లాలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు గ్రామ సచివాలయాలకు వెళుతున్నారు. అక్కడ సర్వర్ పని చేయకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం నుండి అక్కడే నిరీక్షిస్తున్నా సర్వర్ సమస్య ఉందని, మళ్లీ రావాలని గ్రామ సచివాలయ సిబ్బంది చెబుతుండటంతో అవస్థలు పడుతున్నారు. అలాగే మార్పులు, చేర్పులకు ఈకేవైసీ చేయించేందుకు అధికారులు ఎంత ప్రయత్నం చేసినా సర్వర్ తీసుకోవడం లేదని అంటున్నారు. రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ మొదలైనప్పటి నుండి సర్వర్ సమస్యతో గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు సచివాలయం వద్దే వేచి చూస్తున్నా పని జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి స్వగ్రామాలకు వచ్చి దరఖాస్తు చేసుకుంటున్న వారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. పొట్టకూటి కోసం నగరాలకు వలసబాట పట్టామని, రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటే సర్వర్ పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సమస్య ఉందని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని సంబంధిత మంత్రి, అధికారులు చెబుతున్నారు.

ఆప్షన్ లేక అవస్థలు

ఉమ్మడి కుటుంబంలో బియ్యం కార్డులో ఉండి వివాహం తర్వాత ఉమ్మడి కార్డు నుంచి విడదీయాలని అడిగితే ఆప్షన్ లేదని అధికారులు చెబుతున్నారని పలువురు వాపోతున్నారు. అలాగే కొందరు సింగిల్ కార్డు పొందేందుకు దరఖాస్తు చేసుకోగా అందుకు ఆప్షన్ చూపించడం లేదని చెబుతున్నారు. కొత్తగా వివాహమైన వారు కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు మ్యారేజ్ సర్టిఫికెట్, పెళ్లికార్డు తీసుకెళ్లాలని చెబుతున్నారు. అయితే జిల్లా అధికారులు అవి అవసరం లేదని అంటున్నా సచివాలయ సిబ్బంది ఇంకా తమకు ఆప్షన్ రాలేదని చెబుతున్నారని వాపోతున్నారు. దీంతో అనేక మంది అవస్థలు పడుతున్నారు.

సమస్య లేకుండా చూస్తాం

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు, మార్పులు చేసుకోవడానికి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. సర్వర్ సమస్యతో కొంత ఇబ్బంది కలుగుతుంది. టెక్నికల్ సమస్య కారణంగా సమస్య వస్తుంది. సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్ళాం. త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు.

– వెంకటసుబ్బయ్య, తహసీల్దారు, కాశినాయన మండలం

కనుమ పోలేరమ్మ గుడి ప్రాంగణలో వర్షపు నీరు



కనుమ పోలేరమ్మగుడి ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని బద్వేల్ రోడ్డులో వెలసి కనుమ పోలేరమ్మ గుడి భక్తులకు ఆకర్షణగా ఉంది. మఠం నిధులతో గుడిని తిరిగి నిర్మించారు. అమ్మవారికి ప్రతి ఆదివారం, మంగళవారం, గురువారం దూరప్రాంతాల నుంచి భక్తులు వచ్చి బోనాలు పెడతారు. మాంసాహారాలు అక్కడనే చేసుకొని భుజించి వెళ్లారు. భక్తుల సౌకర్యం కోసం లక్షరూపాయలు ఖర్చు చేశారు. గుడి ప్రాంగణంలో ఈమధ్యనే సిమెంట్ ఫ్లోరింగ్ చేశారు. అయ్యితే కొద్దిపాటి వర్షం రాగానే నీరు అక్కడనే నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడక తప్పడంలేదు. దేవస్థానం నిర్వాకులు పరిశీలించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

పట్టణానికి దూరంగా పందుల పెంపకం



పందుల పెంపకందారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

మైదుకూరు : పట్టణానికి దూరంగా పందులను పెంచుకోవాలని మైదుకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పందుల పెంపకందారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరి పందుల పెంపకందారులతో సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా పందులు తిరుగుతూ రోగాలకు కారణమవుతున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పందులను పట్టణానికి దూరంగా తీసుకెళ్లాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పందుల పెంపకానికి ప్రత్యేకంగా రెవెన్యూ అధికారులు స్థలాలను కేటాయిస్తారని పేర్కొన్నారు. రానున్న వర్షాకాలంలో నివాస ప్రాంతాల్లో పందులు సంచరించడం వల్ల ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.


పెట్రోలు బంకు సిబ్బంది సేవలు అభినందనీయం



పెట్రోలు బంకు సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకు సిబ్బంది సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెట్రోలు బంకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోలు బంకు రోజువారి వ్యాపారం సరాసరి రూ.5.50 లక్షలకు చేరిందని, సిబ్బంది ఉత్తమ సేవలు అందించడంతోనే ఈ ఆదాయం సాధించడం సాధ్యమైందని సిబ్బందిని అభినందించారు. అలాగే పురపాలక సంఘంకు చెందిన పెట్రోలు బంకుపై నమ్మకంతో వ్యాపారాభివృద్ధికి సహకరించిన వినియోగదారులందరికి ధన్యవాదాలు తెలిపారు. రాబోవు రోజుల్లో మరింత కష్టపడి పురపాలక సంఘం ఆదాయం పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సతీష్‌కుమార్, పెట్రోలు బంకు మేనేజర్ కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న సీఐ రమణారెడ్డి

మైదుకూరు : చోరీలపై అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ కె.రమణారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని సర్వాయపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న వారితో ఆయన మాట్లాడారు. ఇళ్లల్లో విలువైన వస్తువులను ఉంచుకోరాదని, ఇంటికి తాళం వేసి ఊర్లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే మంచిదని సీఐ పేర్కొన్నారు. ఇళ్ల వద్ద ఉంచే మోటారు సైకిళ్లకు తప్పనిసరిగా సైడ్ లాక్ వేయాలని సూచించారు. ఏ సమస్యలున్నా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

• విశ్రాంతి గదులు లేక..

వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండులో విశ్రాంతి గదులు లేకపోవడంతో డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్లవారుజామునే డ్యూటీకి వెళ్లాల్సిన వారు ఎక్కడా సదుపాయం లేక ఆర్టీసీ బస్సుల్లోనే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. బస్టాండు పరిసరాలు కూడా పరిశుభ్రంగా లేకపోవడంతో ఒక వైపు దోమల మోత, మరోవైపు చలితో నానా అవస్థలు పడుతున్నారు. వారు రాత్రంతా సక్రమంగా నిద్రపోతే పొద్దున్నే ప్రయాణీకులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో డ్రైవింగ్ చేసేటప్పుడు తూగితే బస్సులోని ప్రయాణీకులకు ప్రమాదం తప్పదు. ఆర్టీసీ అధికారులు ఈ విషయాన్ని గుర్తించి డ్రైవర్లు, కండక్టర్లకు మౌళిక వసతులతో విశ్రాంతి గదులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప





నేడు బండలాగుడు పోటీలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని దిరసవంచ పంచాయతీ బోడపాడు గ్రామంలో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు. స్థానిక గ్రామ పెద్దల కమిటీ అధ్యక్షుడు బిజివేముల రామసుబ్బారెడ్డి ఆధర్యంలో కమిటీ సభ్యులు జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతి కార్యక్రమాలు, అన్నదానాలు, బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. బి.మఠంలో కూడా హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. బద్వేల్ రోడ్డులోని హనుమాన్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు ఓబయ్య తెలిపారు.

నేడు ఆంజనేయస్వామి ఉత్సవం

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరంలోని రెండు కొళాయిల వద్ద వెలసిన శ్రీసంజీవ ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు భక్త బృందం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమత్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, 9 గంటలకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని వారు వివరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు శోభాయాత్ర

పోరుమామిళ్ల : పట్టణంలోని మల్లకతువ వద్ద వెలసిన అభయాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 8 గంటలకు గిరినగర్ రామాలయం నుండి అభయాంజనేయస్వామి దేవస్థానం వరకు పట్టణ ప్రధాన రహదారిలో శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలందరూ శోభాయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మినీ మహానాడు బాయ్‌కాట్

బి.కోడూరు : బద్వేలులో బుధవారం జరిగిన మినీ మహానాడును బి.కోడూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు బాయ్‌కాట్ చేశారు. మండలంలోని అధికారులు తాము చెప్పినట్లు నడుచుకోవడం లేదని, తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ పలుమార్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జికి తెలిపినా ఫలితం లేదన్నారు. అందుకు నిరసనగా బుధవారం బద్వేలులో జరిగిన మినీ మహానాడును బాయ్‌కాట్ చేసి తమ నిరసనను వ్యక్తం చేసినట్లు మండలానికి చెందిన టీడీపీ నాయకులు తెలిపారు.

ఖాజీపేట తహసీల్దార్ బదిలీ

ఖాజీపేట : ఖాజీపేట తహసీల్దార్ మహబూబ్ బాషా బదిలీ అయ్యారు. అతి తక్కువ కాలంలోనే బదిలీ కావడంపై సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జరిగిన బదిలీల్లో భాగంగా అక్టోబర్ 2024లో మహబూబ్ బాషా బదిలీపై ఖాజీపేటకు వచ్చారు. అయితే బదిలీపై వచ్చినప్పటి నుంచి అనేక రాజకీయ పరిణామాలు ఇక్కడ చోటు చేసుకున్నాయి. వివాదాస్పద స్థలాల విషయంలో తహసీల్దార్ సరైన రీతిలో స్పందించకపోవడంతోనే బదిలీ అయినట్లు రాజకీయ వర్గాల్లో చర్చనడుస్తోంది. వచ్చిన 7నెలలకే బదిలీ చేయడంపై అందరూ మాట్లాడుకుంటున్నారు. కూటమి నేతలకు అనుకూలంగా పనిచేసి ఉంటే బదిలీ జరిగి ఉండేదికాదని కొందరు అంటున్నారు.

నేడు మైదుకూరులో 'కేతు' వర్ధంతి సభ

మైదుకూరు : మైదుకూరులో గురువారం ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు కేతు విశ్వనాథరెడ్డి ద్వితీయ వర్ధంతి సభను నిర్వహిస్తున్నారు. చరిత్ర పరిశోధకుడు, రచయిత బొమ్మిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో సాహితీ ప్రియులు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో కేతు వర్ధంతి సభను నిర్వహిస్తున్నారు. కేతు అభిమానులు, సాహిత్య ప్రియులు పాల్గొనాలని బొమ్మిశెట్టి రమేష్ కోరారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

ఆర్డీఓ చంద్రమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసిన తర్వాత నిర్దేశించిన సమయంలోగా బాధితులను విచారించి వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని, ఇందులో ఎలాంటి కాలయాపన చేయరాదని సూచించారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 20 ఎస్సీ, ఎస్టీ కేసులలో విచారణ పూర్తి చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే ఇందుకు సంబంధించిన కులధృవీకరణపత్రాలు ఆయా తహసీల్దార్లు త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రతి నెల 30వ తేదీన అందరూ తహసీల్దార్లు సివిల్‌రైట్స్ డే నిర్వహించాలని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన డివిజన్ స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ రామనాథరెడ్డి, అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్, మెంబర్లు రోశన్న, చింతలచెరువు నారాయణ, పార్థసారథి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కంపచెట్లు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రోడ్డుకు అడ్డంగా వాలి ఉన్న కంపచెట్లు

బి.కోడూరు : మండలంలోని లోయర్ సగిలేరు ప్రాజక్టు వద్ద నుండి టమటంవారిపల్లె మీదుగా తువ్వపల్లె, మున్నెల్లి, రాజుపాలెం, గుంతపల్లె, బి.కోడూరు మండల కేంద్రానికి వెళ్ళాలంటే రెండు రోజుల క్రితం వీచిన గాలివానకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు రోడ్డు మీదికి పూర్తిగా వాలిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందు వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో పాటు కార్లు తదితర వాహనాలు వెళ్లేందుకు వీలులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. బుధవారం ఓ కారు ప్రమాదానికి గురైంది. ఈ దారి వెంట ప్రతినిత్యం పోరుమామిళ్ళ నుండి మండల కేంద్రానికి వెళ్ళే అధికారులు వెళ్ళాల్సి ఉంది. పోరుమామిళ్ళకు వెళ్ళాలంటే తమటంవారిపల్లె, మున్నెల్లి, బోడుగుండుపల్లె గ్రామాల ప్రజలు ఆ దారి వెంట వెళ్ళాల్సి ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవచూపి రోడ్డుకు వైపు వాలి ఉన్న కంపచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ ద్వారా పన్ను చెల్లించవచ్చు



వాట్సాప్ ద్వారా పన్ను ఎలా చెల్లించాలో వివరిస్తున్న ఈఓపీఆర్‌డీ రామాంజనేయరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : గ్రామ పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలను చేపట్టడంలో భాగంగా ఇంటి పన్నులు, కొళాయి, నీటి పన్ను చెల్లించేందుకు స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా కానీ, క్యూ ఆర్ కోడ్ ద్వారా కానీ, వాట్సాప్ నంబర్ ద్వారా చెల్లించవచ్చని ఈఓపీఆర్‌డీ రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన వెబ్‌సైట్ వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆన్‌లైన్‌లో డిజిటల్ పేమెంట్ రూపంలో పన్నులు చెల్లించడానికి స్వర్ణ గ్రామ పంచాయతి వెబ్‌సైట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ సౌకర్యాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లోని ప్రజలకు ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలన్నారు.

హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపవద్దు



హెచ్ఐవీ గురించి వివరిస్తున్న కళాకారులు

ప్రొద్దుటూరు క్రైం : హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని, వారిని ఆదరించాలని ప్రొద్దుటూరు మున్సిపల్ డీఈ ప్రభాకర్ తెలిపారు. స్థానిక గాంధీ పార్కులో చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నాటక రూపంలో ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలకు వివరించారు. హెచ్ఐవీ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు మున్సిపల్ ఏఈ దిల్షాద్, సీఈఆర్‌డీఎస్ ప్రాజెక్టు మేనేజర్ నరేష్ కుమార్, ఏఆర్టీ సిబ్బంది సాదిక్ బాషా, ఓబుళమ్మ, భాగ్యలక్ష్మి, సునీత, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మామిడి చెట్ల కోసం ఘర్షణ

మహిళకు గాయాలు



దాడిలో గాయపడిన సరస్వతి

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి పంచాయతీలోని రాజుపాలెం గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి రమణారెడ్డి, ఓబుల్‌రెడ్డి సుబ్బారెడ్డి సర్వేనెంబర్ 2253 లోని మామిడిచెట్లకు ఉన్న కాయల విషయమై బుధవారం ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఓబుల్‌రెడ్డి సరస్వతికి కంటి వద్ద స్వల్ప గాయమైంది. వివరాల్లోకి వెళితే సర్వే నెంబర్ 2253 లోని మామిడిచెట్ల విషయమై గత కొంతకాలంగా ఓబుల్‌రెడ్డి రమణారెడ్డి, ఓబుల్‌రెడ్డి సుబ్బారెడ్డిల మధ్య వివాదం నడుస్తూ ఉంది. మంగళవారం ఓబుల్‌రెడ్డి సుబ్బారెడ్డి గ్రామంలో లేని సమయం చూసి ఓబుల్‌రెడ్డి రమణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మామిడిచెట్లకు ఉన్న కాయలను కోయగా బుధవారం ఇంటికి తిరిగి వచ్చిన ఓబుల్‌రెడ్డి సుబ్బారెడ్డి ఓబుల్‌రెడ్డి రమణారెడ్డిని ప్రశ్నించగా తనపై దాడికి దిగారని, ఈ దాడిలో సుబ్బారెడ్డి భార్య ఓబుల్‌రెడ్డి సరస్వతి కంటి వద్ద స్వల్ప గాయమైంది. ఈ విషయమై బి.కోడూరు పోలీసులకు ఓబుల్‌రెడ్డిసుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. గాయపడిన సరస్వతి పోరుమామిళ్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఫౌంటేన్ కాదు.. పైపులైన్ లీకేజీ



పల్లవోలు వద్ద జాతీయ రహదారి పక్కన పైపులైన్ లీకేజీతో పైకి ఎగిసిపడుతున్న నీరు

ఇక్కడ పంట పొలాల్లో నీరు పైకి లేస్తున్న దృశ్యం చూస్తే పార్కులు.. పర్యాటక క్షేత్రాల వద్ద కన్పించే ఫౌంటేన్‌లా కన్పిస్తుంది. నిజానికి మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సచివాలయం సమీపంలోని ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారి పక్కన దీనికి చూసిన వారు ఫౌంటేన్ అనుకుంటే పొరబడినట్లే. బ్రహ్మంగారిమఠం వద్ద గల బ్రహ్మంసాగర్ నుంచి ఎర్రగుంట్ల మండలంలోని కలమల్ల వద్ద గల రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్(ఆర్టీపీపీ)కి నీటిని అందించే పైపులైన్ లీకేజీ కావడంతో ఇలా నీరు పైకి చిమ్ముకుంటూ వృథాగా పోతోంది. ఈ నీటి ద్వారా పొలాలకు ఇబ్బంది కలగటంతో పాటు నీరు వృథా అవుతోందిని, సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

– చాపాడు